దొడ్డి కొమురయ్య త్యాగం ఎనలేనిది

అమరుల స్ఫూర్తితోనే తెలంగాణ ప్రగతి ప్రస్థానం

రాష్ట్ర ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెల్లడి

వర్ధంతిని పురస్కరించుకొని కొమురయ్యకు నివాళి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు దొడ్డి కొమురయ్య త్యాగం ఎనలేనిదని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు కొనియాడారు. మంగళవారం కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకొని నివాళి అర్పించారు. సేవలను, అమరుల పోరాటాలను సీఎం కేసీఆర్ స్మరించుకొన్నారు. దశాబ్దాలపాటు కొనసాగిన తెలంగాణ ప్రాణ త్యాగాల పరంపరను స్వయం పాలనలో ప్రగతి ప్రస్థానంతో నిలువరించగలిగామని, నాటి ఉమ్మడి రాష్ట్రంలో పాలకులు కల్లోలిత ప్రాంతాలుగా ప్రకటించిన గోదావరి నదీలోయ తదితర ప్రాంతాలు నేడు కాళేశ్వరం జలాలతో పచ్చని పంట పొలాలతో అలరారుతున్నాయని సీఎం కేసీఆర్ వివరించారు. నాటి త్యాగాల ప్రతీకల స్థానంలో కొత్త ప్రగతి ఆనవాళ్లు సంతరించుకొన్నాయని తెలిపారు. అమరుల ఆకాంక్షలను నిజం చేస్తూ, ఉద్యమ లక్ష్యాన్ని సాధించుకుంటూ కేవలం తొమ్మిదేండ్లల్లోనే తెలంగాణ సమాజానికి భవిష్యత్తుపై ఒక భరోసాను నింపగలిగామని వెల్లడించారు. అన్ని రంగాలను పునరుజ్జీవింపచేసుకొంటూ తెలంగాణను పునర్ నిర్మించుకొంటూ సాగుతున్న స్వయం పాలన దేశానికే ఆదర్శంగా నిలువడం వెనుక అమరుల ఆశయాల స్ఫూర్తి ఇమిడి ఉన్నదని తెలిపారు. వ్యవసాయం, సాగు, తాగు నీరు, విద్యుత్తు, రోడ్లు, విద్య, వైద్యం వంటి సకల మౌలికవసతులను తీర్చిదిద్దడం ద్వారా నేడు తెలంగాణ గుండెనిబ్బరంతో ఉన్నదని ఆనందం వ్యక్తంచేశారు. అభద్రతా భావాన్ని వీడి నేడు సబ్బండ వర్ణాలు అభివృద్ధి పథంలో పయనిస్తూ సంతోషంతో జీవిస్తున్నాయని వివరించారు. అమరుల ఆశయాల సాధనే అత్యున్నత కర్తవ్యంగా భావించిన తెలంగాణ ప్రభుత్వం ఆ దిశగా చేపట్టిన కార్యాచరణతో సత్ఫలితాలు సాధిస్తున్నదని సీఎం ఉద్ఘాటించారు. తెలంగాణ అమరుల మహోన్నత త్యాగాలను సమున్నతంగా గౌరవించుకొనేందుకు, భవిష్యత్తు తరాలు, అమరుల త్యాగాల చరిత్రను నిత్యం స్మరించుకొనేలా హైదరాబాద్ నడిగడ్డపై దశాబ్ది ఉత్సవాల చారిత్రక సందర్భంలో 'తెలంగాణ అమర జ్యోతి'ని ప్రజ్వలనం చేసుకున్నామని గుర్తుచేశారు. అమరుల స్మారకం మనకు నిత్య స్ఫూర్తినందిస్తుందని, దొడ్డి కొమురయ్య త్యాగాన్ని స్మరించుకొనే దిశగా జయంతి, వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నదని సీఎం కేసీఆర్ వెల్లడించారు.

అల్లూరి స్ఫూర్తితో ముందుకు సాగాలి

ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు వెల్లడి

నేటితో 125వ జయంతి ఉత్సవాల ముగింపు

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): దేశ స్వాతంత్ర్యం కోసం, స్వయం పాలన కోసం తన ప్రాణాలను పణంగా పెట్టి బ్రిటిష్ పాలకులతో పోరాడిన అల్లూరి సీతారామరాజు త్యాగం గొప్పదని, స్వాతంత్ర్యోద్యమ చరిత్రలో వారి అమరత్వం అజరామరమని ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమం మంగళవారం హైదరాబాద్‌లో జరుగుతున్న సందర్భంగా దేశం కోసం వారు చేసిన త్యాగాన్ని సీఎం కేసీఆర్ స్మరించుకొన్నారు. గిరిజనుల హక్కుల సాధన కోసం నాటి బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా అల్లూరి ప్రదర్శించిన అసమాన ధైర్యసాహసాలు, పోరాట స్ఫూర్తి చిరస్మరణీయమని చెప్పారు. సీతారామరాజు వంటి వీరుల స్ఫూర్తితో ఎందరో దేశ పౌరులు నాటి స్వాతంత్ర్యోద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. భారత రాష్ట్రపతి పాల్గొంటున్న, చారిత్రక సందర్భమైన అల్లూరి సీతారామరాజు 125వ జయంతి ఉత్సవాల ముగింపు కార్యక్రమాన్ని తెలంగాణ గడ్డమీద హైదరాబాద్‌లో నిర్వహించుకోవడం గొప్ప విషయమని పేర్కొన్నారు. ప్రజల కోసం పోరాడే త్యాగధనుల జీవితాలు విశ్వజనీనమైన స్ఫూర్తిని పంచుతాయని, వారి త్యాగాలను స్మరించుకొంటూ రేపటి తరాలు ముందుకు సాగాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు.

సోమవారం ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుతో సమావేశమైన ఎస్పీ అధినేత అఖిలేశ్ యాదవ్

బీజేపీని ఓడిద్దాం

మూడోపేజీ తరువాయి...

వచ్చినట్టు వెల్లడించారు. సీఎం కేసీఆర్‌తో భేటీ అయ్యేందుకు మధ్యాహ్నం 12.45 గంటలకు బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్న అఖిలేశ్‌కు మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎమ్మెల్సీ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఘన స్వాగతం పలికారు. ప్రగతిభవన్‌కు చేరుకున్న అఖిలేశ్‌కు సీఎం కేసీఆర్ పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాతో సత్కరించారు. కాసేపు సేద తీరిన అనంతరం.. సీఎం కేసీఆర్ వారికి మధ్యాహ్న భోజన ఆతిథ్యం ఇచ్చారు. ఆ తరువాత ఇద్దరు దాదాపు మూడు గంటలపాటు జాతీయ రాజకీయాలతోపాటు పలు అంశాలపై చర్చించారు. కేంద్రం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలు, రాష్ట్రాల అభివృద్ధిని అడ్డుకుంటూ బీజేపీ ఆడుతున్న స్వార్థ రాజకీయ క్రీడ వంటి అంశాలు చర్చకు వచ్చాయి. పలు రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలను బలహీనపరచడానికి ఆయా పార్టీల నేతలను ఈడీ బెదిరింపులకు గురిచేస్తూ, బ్లాక్ మెయిలింగ్ రాజకీయాలకు పాల్పడుతున్న బీజేపీ ధోరణి దేశ ప్రజాస్వామిక వ్యవస్థలకు గొడ్డలిపెట్టుగా మారిందని ఇరువురు నేతలు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రాంతీయ పార్టీలను నిట్టనిలువునా చీలుస్తూ, తెల్లారేసరికి ప్రభుత్వాలను కూలదోస్తూ, రాజకీయ అస్థిరత్వానికి పాల్పడుతూ, ఒక అప్రజాస్వామిక వాతావరణాన్ని దేశవ్యాప్తంగా బీజేపీ పెంచి పోషిస్తుండటం శోచనీయమని వారు ఆవేదన వ్యక్తంచేశారు.

కేసీఆర్ లేని పోరాటానికి అర్థం ఉండదు

దేశంలో అప్రజాస్వామిక వాతావరణం, రాజకీయ అనిశ్చితి నెలకొన్న నేపథ్యంలో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడేందుకు భావసారూప్యత గల పార్టీలన్నీ ఐక్యం కావాల్సిన సమయం ఆసన్నమైందని అఖిలేశ్ అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో జాతీయ పార్టీగా అనూహ్యంగా ఎదుగుతూ దేశ ప్రజల ఆదరణ చూరగొంటున్న బీఆర్ఎస్ పార్టీ ఐక్య సంఘటనలో భాగస్వామ్యం కావాలని అఖిలేశ్ ఆహ్వానించారు. ప్రజాస్వామిక పద్ధతిలో, శాంతియుతంగా ఉద్యమాన్ని కొనసాగించి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించడమే కాకుండా, అనతి కాలంలోనే తెలంగాణ అన్ని రంగాల్లో సమాంతరంగా అభివృద్ధి సాధిస్తున్న తీరు తమ వంటి ఇతర రాష్ట్రాలకు ఎంతో ఆదర్శమని స్పష్టంచేశారు. ఇంతటి దార్శనికత గల జాతీయ నేత సీఎం కేసీఆర్ లేకుండా ప్రత్యామ్నాయ ఐక్య సంఘటనకు అర్థమేలేదని, తమతో కలిసి ముందుకు సాగాలని ఆహ్వానించారు.

దేశ ప్రజల దృష్టిని ఆకర్షిస్తున్న బీఆర్ఎస్

'అబ్ కీ బార్ కిసాన్ సర్కార్' నినాదంతో మహారాష్ట్ర సహా దేశ ప్రజల దృష్టిని బీఆర్ఎస్ ఆకర్షిస్తున్నదని, జాతీయ పార్టీగా పరిణామం చెందిన అనతి కాలంలోనే బీఆర్ఎస్ అనూహ్యంగా ఎదిగి దేశ ప్రజాదరణ పొందడం గొప్ప విషయమని అఖిలేశ్‌యాదవ్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షుడు, సీఎం కే చంద్రశేఖర్‌రావుకు అఖిలేశ్ అభినందనలు తెలియజేశారు. బీఆర్ఎస్ పార్టీని మహారాష్ట్ర సహా దేశవ్యాప్తంగా రైతులు, ఇతర వర్గాలు ఆదరిస్తున్న తీరు గొప్పగా ఉన్నదని కొనియాడారు. దక్షిణ భారత దేశం నుంచి ఒక జాతీయ పార్టీని స్థాపించడమే కాకుండా, దేశ ప్రజల మన్ననలు అందుకోవడం గొప్ప విషయమని అభినందించారు. సీఎం కేసీఆర్‌తో భేటీ అనంతరం అఖిలేశ్ యాదవ్ తిరుగు ప్రయాణమయ్యారు. వారికి సీఎం కేసీఆర్ ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ భేటీలో మంత్రులు తలసాని, వేముల, ఎంపీ సంతోష్‌కుమార్, ఎమ్మెల్సీ పల్లా, ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి, మాజీ మంత్రి వేణుగోపాలాచారి, బీఆర్ఎస్ నేతలు కల్వకుంట్ల వంశీధర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయిలో ప్రాధాన్యం

సీఎం కేసీఆర్‌తో అఖిలేశ్ సమావేశం జాతీయస్థాయిలో ప్రాధాన్యం సంతరించుకొన్నది. వీరిరువురి భేటీ సాగుతున్నంత సేపు జాతీయ, ప్రాంతీయ మీడియా సంస్థలు చర్చా కార్యక్రమాలు కొనసాగించాయి. తాము బీఆర్ఎస్‌తో కలవబోం అని ఆదివారం ఖమ్మం సభలో రాహుల్‌గాంధీ చేసిన వ్యాఖ్యలను ఊటంకిస్తూ జాతీయ మీడియా కథనాలను ప్రసారం చేసింది. ఇప్పటికే జాతీయ రాజకీయాల్లో చొచ్చుకుపోతున్న బీఆర్ఎస్‌పై దేశమంతా దృష్టి సారించిన నేపథ్యంలో జాతీయ రాజకీయాలను ప్రభావితం చేసే దిశగా పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ నాయకత్వం ముందడుగు వేస్తున్నది. ఇప్పటికే దేశవ్యాప్తంగా ప్రజాదరణ పొందుతున్న జన నేతగా సీఎం కేసీఆర్ ఆవిర్భవిస్తున్న చారిత్రక సందర్భంలో జాతీయ రాజకీయాల్లో ఆయన పాత్రను విస్మరించే పరిస్థితి లేదనేది వారి అంచనా. ఖమ్మంలో రాహుల్ గాంధీ చేసిన విమర్శలు అవగాహనా రాహిత్యంతోనే తప్ప, మరోటి కాదని రాజకీయ విశ్లేషకులు స్పష్టం చేస్తున్నారు. బీజేపీకి వ్యతిరేకంగా సాగే విపక్ష కూటమిలో ప్రధాన పాత్ర పోషించేందుకు సీఎం కేసీఆర్‌కు ఆహ్వానంలో భాగంగానే అఖిలేశ్ యాదవ్ భేటీ అని జాతీయ మీడియాలో విశ్లేషణలు కొనసాగడం ప్రాధాన్యం సంతరించుకొన్నది.

నవధాన్యాలతో కేసీఆర్ నిలువెత్తు చిత్రపటం

ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రికి బహూకరించిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్ రావు నిలువెత్తు చిత్రపటాన్ని నవధాన్యాలతో రూపొందించారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌కు సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య బహూకరించారు. ఆర్టిస్టు గొట్టేటి బాలకృష్ణ అతని కుమార్తె సాయిశ్రీ 6 అడుగుల ఎత్తు, 4 అడుగుల వెడల్పుతో సీఎం చిత్రపటాన్ని రూపొందించారు. ఈ చిత్రపటాన్ని దశాబ్ది ఉత్సవాల్లో సత్తుపల్లి రైతు వేదికలో ప్రదర్శించినట్లు సీఎం కేసీఆర్‌కు ఎమ్మెల్యే సండ్ర వివరించారు. ఎమ్మెల్యే వెంట సత్తుపల్లి మున్సిపల్ చైర్మన్ కూసంపూడి మహేశ్, ఆర్టిస్టులు గొట్టేటి బాలకృష్ణ, సాయిశ్రీ ఉన్నారు.

నవధాన్యాలతో రూపొందించిన ముఖ్యమంత్రి చిత్రపటాన్ని సోమవారం ప్రగతిభవన్‌లో కేసీఆర్‌కు బహూకరించిన సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య

పీఎం శ్రీ పథకానికి కేంద్రం తూట్లు

- 44 శాతం స్కూళ్లకే అనుమతులు
- 14 వేల స్కూళ్లని అవాస్తవ ప్రచారం
- రూ.27 వేల కోట్లు ఖర్చు అని బాకా
- ఈ ఏడాది ఆరు వేల స్కూళ్లు ఎంపిక

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): బొంకరా పోలిగా అంటే.. టంగుటూరు మిరియాలు తాటికాయంత అన్నట్టుగా ఉన్నది కేంద్ర సర్కారు తీరు. జనాల మెప్పు కోసం ఆకుకు అందకుండా పోకకు పొందకుండా అవాస్తవాలు ప్రచారం చేస్తున్నది. పీఎం శ్రీ స్కూల్స్ పథకం అమలులో కేంద్ర సర్కారు ఇదే రీతిన వ్యవహరిస్తున్నది. ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కేంద్ర విద్యా శాఖ గతంలోనే పీఎం శ్రీ స్కూల్స్ పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం కింద దేశవ్యాప్తంగా 14,500 స్కూళ్లను అభివృద్ధి చేస్తామని కేంద్రం ప్రకటించింది. కానీ, ఈ విద్యా సంవత్సరంలో లక్ష్యంగా నిర్దేశించుకున్న వాటిలో 44 శాతం స్కూళ్లనే ఎంపిక చేసింది. మిగతా వాటికి మొండిచేయి చూపించింది. జాతీయంగా 6,448 స్కూళ్లను ఎంపికచేయగా, వాటిలో కేంద్రీయ విద్యాలయాలు 735, నవోదయ విద్యాలయాలు 317 ఉన్నాయి. మరో 5,396 మాత్రమే రాష్ట్రాలకు చెందిన పాఠశాలలున్నాయి.

మూడోస్థానంలో తెలంగాణ

బడులు ఎంపికైన రాష్ట్రాల్లో తెలంగాణ మూడోస్థానంలో ఉన్నది. ఉత్తరప్రదేశ్ 928 స్కూళ్లతో అగ్రస్థానంలో, 662 స్కూళ్లతో ఆంధ్రప్రదేశ్ రెండోస్థానంలో 542 స్కూళ్లతో తెలంగాణ మూడోస్థానంలో నిలిచింది. వాస్తవానికి మండలానికి రెండు చొప్పున రాష్ట్రం నుంచి 1,204 స్కూళ్లు ఎంపిక కావాల్సి ఉన్నది. కానీ, కేంద్రం 542 స్కూళ్లను మాత్రమే ఎంపికచేసింది. ఈ ఏడాది ఈ పథకం కోసం రాష్ట్రం నుంచి 5,973 స్కూళ్లు పోటీపడితే, వాటిలో నుంచి 1,204 స్కూళ్లు షార్ట్‌లిస్ట్ అయ్యాయి. ఈ స్కూళ్ల అభివృద్ధికి వచ్చే ఐదేండ్లలో రూ.27,360 కోట్లను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వెచ్చించనున్నాయి. కేంద్రం తన వాటాగా రూ.18,128 కోట్లను ఖర్చుచేయనున్నది. మిగతా మొత్తాన్ని రాష్ట్రాలు భరిస్తాయి. బడులను పూర్తిగా హరిత స్కూళ్లుగా అభివృద్ధి చేస్తారు.

పలు రాష్ట్రాల నుంచి ఎంపికైనవి

రాష్ట్రం	ఎంపికైనవి
ఉత్తరప్రదేశ్	928
ఆంధ్రప్రదేశ్	662
తెలంగాణ	543
మహారాష్ట్ర	516
మధ్యప్రదేశ్	416
రాజస్థాన్	402
గుజరాత్	274
పంజాబ్	241
జమ్ముకశ్మీర్	233

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నందిమేడారంలోని నందిపంప్ హౌస్ నుంచి ఉబికి వస్తున్న గోదావరి జలాలు

కాళేశ్వరం పంపుల జల గర్జన

మూడోపేజీ తరువాయి...

వెంకటేశ్వర్లు పర్యవేక్షణలో అధికారులు ఎత్తిపోతలను సోమవారం లాంఛనంగా ప్రారంభించారు. లింక్-1 లక్ష్మీ పంప్‌హౌస్‌లో ఆరు పంపుల ద్వారా 13.200 క్యూసెక్కుల నీటిని అన్నారంలోని సరస్వతి బరాజ్‌లోకి తరలిస్తున్నారు. అక్కడ లింక్-2లో నాలుగు పంపులతో 11.720 క్యూసెక్కుల నీటిని పార్వతీ బరాజ్‌లోకి, అక్కడి నుంచి నాలుగు మోటార్ల ద్వారా 10,440 క్యూసెక్కుల నీటిని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి ఎత్తిపోస్తున్నారు. ఎల్లంపల్లికి చేరిన జలాలను ఒకవైపు ఎస్సారెస్పీకి, మరోవైపు రాజరాజేశ్వర జలాశయానికి తరలిస్తున్నారు.

ప్రాణహితలో అంతకంతకూ పెరుగుతున్న వరద

గోదావరిలో ఎక్కడా వరద ప్రవాహాలు లేకపోయినా ప్రాణహితలో మాత్రం రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. రెండు రోజుల క్రితం సగటున 6,500 వేల క్యూసెక్కుల వరద లక్ష్మీ బరాజ్(మేడిగడ్డ)కు చేరగా నీటి ప్రవాహాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఆదివారం 12,500 క్యూసెక్కుల వరద రాగా, అది సోమవారం సాయంత్రం నాటికి 27,500 వేలకు పెరగడం గమనార్హం. వచ్చే మూడురోజుల్లో ఈ వరద మరింత పెరిగనున్నదని, గరిష్ఠంగా 76 వేల క్యూసెక్కుల వరద వచ్చే అవకాశాలున్నాయని అధికారులు అంచనా వేస్తున్నారు. 16.17 టీఎంసీల నిల్వ సామర్థ్యంతో నిర్మించిన లక్ష్మీబరాజ్ ప్రస్తుతం 5.5 టీఎంసీలకు చేరుకున్నది. అధికారుల అంచనా ప్రకారం రాబోయే వారం రోజుల్లోనూ పూర్తిస్థాయి నిల్వ సామర్థ్యానికి చేరుకొనే అవకాశమున్నది.

పెద్దపల్లి జిల్లా మంథని మండలం కాసిపేటలో పార్వతి పంప్‌హౌస్ నుంచి జల ప్రవాహం

ఇప్పటికే ఎస్సార్ఆర్ నుంచి రంగనాయకసాగర్‌కు

ఇప్పటికే రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను నింపేందుకు పంపులను అధికారులు ప్రారంభించారు. శ్రీరాజరాజేశ్వర జలాశయం నుంచి అన్నపూర్ణ జలాశయంలో నీటిని తరలిస్తున్నారు. 3.5 టీఎంసీల సామర్థ్యానికిగాను ప్రస్తుతం అన్నపూర్ణలో 2.75 ఉండగా, పూర్తిస్థాయిలో నింపాలని అధికారులు నిర్ణయించారు. అందుకు అనుగుణంగా పంపింగ్ ప్రారంభించారు. రంగానాయకసాగర్‌లో మూడు టీఎంసీలకుగాను ఇప్పటికే 1.9 టీఎంసీలను నింపగా, పూర్తిస్థాయిలో నింపేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా సోమవారం ఉదయం 6 గంటలకే ఒక పంపును ఆన్ చేసి 3200 క్యూసెక్కుల నీటిని రంగనాయకసాగర్‌కు తరలించారు. సాయంత్రం 6 గంటల వరకు పంపింగ్ కొనసాగింది.

'ఉస్మానియా'కు కొత్త భవనం

- ప్రజాప్రతినిధుల తీర్మానం
- పాత భవనాల చోట కొత్తవి
- కోర్టు అనుమతితో పనులు
- మంత్రి హరీశ్‌రావు వెల్లడి

హైదరాబాద్, జూలై 3 (నమస్తే తెలంగాణ): ఉస్మానియా హాస్పిటల్‌కు కొత్త భవనం నిర్మించాలని ఆ దవాఖాన పరిధిలోని ప్రజాప్రతినిధులు ఏకగ్రీవంగా తీర్మానించారు. ప్రజల వైద్య అవసరాల కోసం పాత భవనాలు తొలగించి అయినా నిర్మాణాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఉస్మానియా దవాఖాన నిర్మాణంపై దవాఖాన పరిధిలోని ప్రజాప్రతినిధులతో మంత్రి హరీశ్‌రావు ఆధ్వర్యంలో సోమవారం సచివాలయంలో సమీక్ష జరిగింది. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ.. ప్రజాప్రతినిధుల అభిప్రాయాన్ని ప్రభుత్వం పరిశీలిస్తుందని తెలిపారు. వివరాలను అఫిడవిట్ రూపంలో హైకోర్టుకు తెలియజేస్తుందని చెప్పారు. హైకోర్టు నుంచి అనుమతి రాగానే నూతన భవన నిర్మాణ పనులు చేపడతామని వెల్లడించారు. దవాఖాన నూతన భవన నిర్మాణానికి ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉన్నదని స్పష్టంచేశారు.

2015లోనే కొత్త భవనానికి ఆదేశం

సీఎం కేసీఆర్ 2015లోనే ఉస్మానియాను సందర్శించి, కొత్త భవన నిర్మాణానికి ఆదేశించినట్టు మంత్రి హరీశ్‌రావు గుర్తుచేశారు. నిర్మాణం కూల్చవద్దని కొందరు హైకోర్టును ఆశ్రయించడంతో ధర్మాసనం స్టే ఇచ్చిందని పేర్కొన్నారు. కోర్టు ఆదేశాల మేరకు ఐఐటీ హైదరాబాద్ నిపుణులతో వేసిన కమిటీ సైతం దవాఖాన అవసరాలకు ఆ భవనం పనికి రాదని చెప్పిందని గుర్తుచేశారు. హైకోర్టు తుదితీర్పు మేరకు కొత్త భవన నిర్మాణం త్వరలో చేపడుతామని చెప్పారు. ప్రస్తుతం ఉన్న గాంధీ, ఉస్మానియా, నిమ్స్‌పై ఒత్తిడిని తగ్గించడంతో పాటు ప్రజల భవిష్యత్ అవసరాలు తీర్చేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు ఇప్పటికే నాలుగు టిమ్స్, నిమ్స్ విస్తరణ, సూపర్ స్పెషాలిటీ ఎంసీహెచ్‌ల నిర్మాణం చేపట్టామని వివరించారు. సమావేశంలో మంత్రులు మహమూద్ అలీ, తలసాని శ్రీనివాస్‌యాదవ్, ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ, ఎమ్మెల్సీలు ప్రభాకర్ రావు, వాణీదేవి, రహమత్ బెగ్, హసన్ ఎఫెండి, ఎమ్మెల్యేలు అక్బరుద్దీన్, దానం నాగేందర్, గోపీనాథ్, జాఫర్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, వైద్యశాఖ కార్యదర్శి రిజ్వీ, సీఎం ఓఎస్డీ గంగాధర్, టీఎస్ఎంఎస్ఐడీసీ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్, ఈఎన్సీ గణపతిరెడ్డి, ఉస్మానియా దవాఖాన సూపరింటెండెంట్ నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌తో నిమ్స్ పోటీ

మూడోపేజీ తరువాయి...

న్యూరో నావిగేషన్ మెషిన్, రూ.5 కోట్లతో హెచ్‌డీఆర్ బ్రాకీథెరపీ, రూ.5 కోట్లతో అనస్థీషియా వర్క్‌స్టేషన్లు, రూ.5 కోట్లతో మొబైల్ డీఎస్ఏ, రూ.4 కోట్లతో ఫ్రాక్చర్ ఫిక్సేషన్ సెట్లు, రూ.4 కోట్లతో పాథాలజీ స్కానర్, రూ.3 కోట్లతో ఇంట్రా ఆపరేటివ్ మైక్రోస్కోప్, రూ.3 కోట్లతో బ్రాంకో స్కోప్‌లు.. ఇలా రూ.154 కోట్లతో ఆయా విభాగాలకు అవసరమైన వైద్య పరికరాలను కొనుగోలు చేసినట్టు తెలిపారు.

డాక్టర్లు మరింత కష్టపడతాంటున్నరు

అత్యాధునిక వైద్య పరికరాలు మరింత కష్టపడి చేసేందుకు ఊతం ఇచ్చాయని నిమ్స్ డైరెక్టర్, వైద్యులు తనతో అన్నారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు. 'ఇంత మంచి వైద్య పరికరాలు వస్తాయని ఊహించలేదని వైద్యులు అంటున్నరు. ప్రభుత్వం తమను ఇంత బలోపేతం చేస్తుందని అనుకోలేదని చెప్పారు. గొప్ప సహకారం అందించిందని, ఇంకా కష్టపడి పనిచేస్తామని హామీ ఇస్తున్నారు. డావెన్సీ రోబోను సమకూర్చుకొన్నందుకు వీరికి (వైద్య సిబ్బందికి) శుభాకాంక్షలు' అని వెల్లడించారు. వైద్య రంగంలో తెలంగాణ దేశంలోనే 3వ స్థానంలో నిలిచిందని, సీఎం కేసీఆర్ రూ.154 కోట్లతో కొత్త పరికరాల కొనుగోలుకు గ్రాంట్ అందించారని తెలిపారు. మిగిలిన వైద్య పరికరాలను త్వరలోనే తీసుకొంటామని పేర్కొన్నారు.

రోబో వల్ల త్వరగా కోలుకుంటారు

గతంలో శస్త్రచికిత్సలు చేయాలంటే బట్టల మీద రక్తపు మరకలు పడేవని వైద్యులు తనతో చెప్పారని, ఇప్పుడు ఈ రోబో వల్ల కడుపు చీరాల్సిన అవసరం ఉండదని, రక్తస్రావం ఉండదని, కోత లేకుండా చిన్నపాటి రంధ్రాలతో సర్జరీ చేయవచ్చని, ఇన్ఫెక్షన్ కూడా పెద్దగా ఉండదని హరీశ్‌రావు తెలిపారు. రోగి దవాఖానలో ఉండాల్సిన సమయం కూడా తగ్గుతుందని, వారికి ఖర్చు తగ్గుతుందని వెల్లడించారు. వైద్యులు ఎక్కువ సర్జరీలు చేయగలుగుతారని చెప్పారు. ఇంత మందికి వైద్యం అందుతున్నదంటే.. సీఎం కేసీఆర్‌కు పేదల పట్ల ఉన్న ప్రేమకు నిదర్శనమని అన్నారు.

ప్రైవేట్ దవాఖానలకు రోగులు కరువు

'ప్రైవేట్ హాస్పిటల్స్ వారికి పేషెంట్స్ దొరకడం లేదు. దీంతో వారు నా దగ్గరకు వచ్చి సార్ మేం కూడా మహిళలకు ఉచితంగానే డెలివరీలు చేస్తాం. ఆ కేసీఆర్ కిట్స్ మా హాస్పిటల్స్‌కు కూడా ఇవ్వండి అని అడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో కొన్ని ప్రైవేటు దవాఖాలైతే డెలివరీకి నాలుగు రోజుల ముందే గర్భిణి ఇంటికి వచ్చి ఉచితంగా అంబులెన్స్‌లో తీసుకెళ్లి రోగితో పాటు వారి సహాయకులకూ ఉచిత భోజనం కల్పించి డెలివరీలు చేస్తున్నట్టు ఒక ఆశావర్కర్ ద్వారా తెలిసింది. కారణం ప్రతి ఒక్కరు ప్రభుత్వ దవాఖానకే వెళ్లటంతో ప్రైవేటు దవాఖానలకు రోగులు దొరుకుతలేరు' అని మంత్రి హరీశ్ తెలిపారు.

సోమవారం నిమ్స్‌లో అత్యాధునిక వైద్య యంత్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి హరీశ్‌రావు

ఆరోగ్యశ్రీ ద్వారా 25 కోట్లు విడుదల

ఆరోగ్యశ్రీ నుంచి డబ్బులు కావాలని ఇప్పుడే డైరెక్టర్ డాక్టర్ బీరప్ప కోరటంతో వెంటనే ఆరోగ్యశ్రీ సీఈవోతో మాట్లాడానని, రూ.25 కోట్లను వెంటనే విడుదల చేయాలని ఆదేశించానని హరీశ్ తెలిపారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ.35 కోట్లు కూడా ఇప్పించాలని కోరడంతో, వాటి విడుదలకు ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శిని ఆదేశించినట్టు చెప్పారు.

తెలంగాణ వచ్చాకే నిమ్స్‌కు మహర్దశ

నిమ్స్ అంటే గత ప్రభుత్వాలకు చిన్నచూపు ఉండేదని, తెలంగాణ వచ్చాక పడకల సామర్థ్యాన్ని 900 నుంచి 1,500కు పెంచామని హరీశ్‌రావు తెలిపారు. 250 పడకల సామర్థ్యం గల ఎంసీహెచ్ సెంటర్ నిర్మాణంలో ఉన్నదని, ఇటీవలే సీఎం రూ.1,571 కోట్లతో 2,000 పడకల నిమ్స్ సూపర్‌స్పెషాలిటీ హాస్పిటల్‌కు శంకుస్థాపన చేశారని వివరించారు. వారం పది రోజుల్లో నిర్మాణ పనులు ప్రారంభమవుతాయని వెల్లడించారు. మొత్తం 4,000 పడకలతో నిమ్స్ దేశంలోనే అతి పెద్ద ప్రభుత్వ రంగ దవాఖానగా ఏర్పడనున్నదని పేర్కొన్నారు. రాష్ట్రం ఏర్పడినప్పుడు ఇక్కడ ఫ్యాకల్టీ సంఖ్య 111 ఉంటే, నేడు 264కు పెంచినట్టు తెలిపారు. నెఫ్రాలజి విభాగం వైద్యులు అద్భుతమైన సేవలు అందిస్తున్నారని, గతంలో ఏటా 25 కిడ్నీ మార్పిడి సర్జరీలు చేస్తే ఇప్పుడు 150 ట్రాన్స్‌ప్లాంట్స్ చేస్తున్నట్టు మంత్రి వివరించారు. 1989-2014 మధ్య 661 కిడ్నీ ట్రాన్స్‌ప్లాంట్స్ చేస్తే, తెలంగాణ వచ్చిన 9 ఏండ్లలో 753 సర్జరీలు చేసినట్టు వెల్లడించారు. బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంట్స్ గతంలో 46 మాత్రమే చేస్తే, తెలంగాణ వచ్చాక 154 ట్రాన్స్‌ప్లాంట్స్ చేసినట్టు తెలిపారు. ఈ తొమ్మిదేండ్లలో 1,444 మోకాళ్ల మార్పిడులు జరిగినట్టు పేర్కొన్నారు. నిమ్స్‌లో మంచి వైద్య సిబ్బంది ఉన్నారని, అవసరమైతే రెసిడెన్షియల్ కాంప్లెక్స్ నిర్మించి, అక్కడే